క్లుప్తంగా

శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఎన్నారైల విరాళం



విరాళం అందజేస్తున్న ఎన్నారై మోతే రాములు

చందుర్తి: మండల కేంద్రంలో చత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఇదే గ్రామానికి చెందిన ఎన్నారైలు మోతే రాములు రూ.51,116, పోతురాజు పాపారావు రూ.20,016 విరాళంగా అందజేసినట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, గ్రామ ఉపసర్పంచ్ సిర్రం తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్ తెలిపారు. ఈ విరాళాలతో గ్రామ ముఖ్యకూడలిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

చెరువులను పరిశీలించిన డిప్యూటీ తహసీల్దార్



తాడూర్‌లో చెరువు పరిశీలిస్తున్న డీటీ దివ్య

తంగళ్లపల్లి: ఈ నెల 8న జరుపనున్న చెరువుల పండగ సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల చెరువులను డిప్యూటీ తహసీల్దార్ గూడ దివ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువుల పండగను విజయవంతం చేయడానికి మండలంలోని తంగళ్లపల్లి, తాడూర్, గోపాలరావుపల్లె గ్రామాల చెరువులు పరిశీలించి తగు ఏర్పాట్ల గురించి తగు సూచనలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, సంతోష్, వాణి, ఫీల్డ్ అసిస్టెంట్ దేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తెలంగాణ సాంస్కృతి ఉట్టిపడేవిధంగా చక్కటి ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, చంద్రమౌళి, భూమక్క,కవిత, విష్ణుప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారం లేనట్టేనా?

- చిరుతల దాడిలో నష్టపోయిన రైతులు
- ఆరు నెలల్లో 15 సంఘటనలు 15 జీవాలు, 20 గొర్రెల మృతి
- దాడులతో వణుకుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలోని వివిధ ప్రాంతాల్లో చిరుతల సంచారం పశువుల కాపరుల కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. వరుస దాడులతో లేగ దూడలు, ఆవులు, మేకలు, గొర్రెలు మరణించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల కాలంలో చిరుతలు లేగదూడలు, గొర్రెల మందలపై 15 సార్లు దాడులు చేసి 15 జీవాలు, 20 గొర్రెల ప్రాణాలు తీశాయి. తాజాగా వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండాలో మూడావత్ నాజంకు చెందిన గొర్రె పొట్టేలుపై చిరుతపులి దాడి చేసి హతమార్చింది. అటవీ, పశువైద్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో వాటి మృతదేహాలు పరిశీలించి పోస్టుమార్టం చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తున్నారే తప్ప, ఏడాది కాలంగా ఏ ఒక్క రైతుకు పరిహారం ఇవ్వలేదు. పరిహారం కోసం బాధిత రైతులు అటవీశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోతున్నారు.



చిరుత



చిరుత దాడిలో హతమైన లేగదూడ,

ఐదు చిరుతలు.. 15 సంఘటనలు

ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో ప్రధానంగా చిరుతలు సంచరిస్తూ వరుస దాడులు చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో నాలుగు పెద్దవి, మూడు పిల్ల చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో సంచరించే చిరుతలు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో దాడులు చేస్తూ జీవాలను హతమారుస్తున్నాయి. చిరుతల సంచారంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారే తప్ప, వాటిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఒకే రోజు దాడి చేసి మూడు లేగ దూడలను హతమార్చాయి. అలాగే రంగంపేట, బాబాయి చెరువుతండాలో లేగదూడలను హతమార్చాయి. గతంలో కూడా వీర్నపల్లి మండలం మద్దిమల్ల, కంచర్ల, రంగంపేట, ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి, వెంకటాపూర్, మద్దిమల్ల, అక్కపల్లిలో గొర్రెల మందపై దాడి చేసి ఆరు జీవాల ప్రాణాలు తీశాయి. చిరుతల సంచారంతో రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లలేక భయకంపితులవుతున్నారు.

నివేదికల వరకే పరిమితం

నష్టపోయిన బాధితుల వేదన వినే అధికారులు కరువయ్యారు. సంఘటన జరిగిన రోజే నివేదికలు తయారు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇన్ని సంఘటనలు జరిగిన ఏ ఒక్క బాధితుడికి పరిహారం అందించకపోవడం బాధకరం. అధికారులు మాత్రం అటవీ శాఖ నుంచి మాత్రమే పరిహారం అందుతుందని, ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో జరిగిన సంఘటనలకు అసలు పరిహారమే రాదని చెబుతున్నారు. కేవలం ఎలుగుబంట్ల దాడిలో గాయపడ్డ, ప్రాణాలు కోల్పోయిన వారికి మాత్రమే ప్రభుత్వపరంగా పరిహారం అందుతుందంటున్నారు. దీన్ని బట్టి పరిహారం నివేదికలు కాగితాలకే పరిమితమవుతున్నాయని చెప్పవచ్చు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నారు.

పరిహారం అందించాలి



చిరుతపులుల దాడిలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలి. 30 గొర్రెలు ఉన్న తన కుటుంబం వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఆదివారం చిరుత దాడిలో రూ.30 వేల విలువ చేసే గొర్రె పొట్టేలు మరణించింది. తీవ్రంగా నష్టపోతున్న నా లాంటి పేద రైతులకు పరిహారం అందించాలి. అటవీ ప్రాంతాల్లో ఉంటున్న గిరిజనులకు చిరుతల నుంచి తమకు రక్షణ కల్పించాలి.

– మూడవత్ నాజం, గిరిజన రైతు, బాబాయిచెరువుతండా

రిజర్వు ఫారెస్టులో ఘటనలకు పరిహారం రాదు



అనుమతులు లేకుండా రిజర్వు ఫారెస్టులను చదును చేసి అక్కడ వ్యవసాయం చేస్తూ లేగదూడలను కట్టివేస్తే వారికి ప్రభుత్వపరంగా పరిహారం రాదు. కొంత మంది అనుమతులు లేని ప్రాంతాలకు వెళ్లి పశువులు, గొర్రెలను మేపుతున్నారు. ఆ సమయంలో జరిగే దాడులకు పరిహారం అందించలేం. ఏడాది క్రితం జరిగిన కొన్ని సంఘటనల్లో రైతులకు పరిహారం వచ్చింది. ఎలుగుబంట్ల దాడిలో గాయపడ్డ వారికి రూ.25 వేల చొప్పున అందించాం.

– బాపిరాజు, సెక్షన్ అధికారి, ఎల్లారెడ్డిపేట



వేములవాడ: సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సీమంతాలు.. అక్షరాభ్యాసాలు



ఎల్లారెడ్డిపేటలో..

వేములవాడ/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట: అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్, కోనరావుపేట మండలం కనగర్తి, ఎల్లారెడ్డిపేట మండలం పదిర అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాలను చిన్నారులు సద్వినియోగం చూసుకోవాలని కోరారు. గర్భిణులు కేంద్రాల ద్వారా అందించే అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, శోభ, మధుర, సుమలత, సర్పంచ్ వజ్రమ్మ, సెస్ మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, ఎంపీటీసీ ఉప్పుల మల్లేశం, ఉపసర్పంచ్ సురేందర్, కార్యదర్శి సారిక పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రయాణం.. ప్రమాదకరం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దేవునిగుట్ట నుంచి బాకూరుపల్లి వెళ్లే దారిలో కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. ప్రమాదం అంచున వాహనదారులు ప్రయాణం చేస్తున్నారు. రాత్రివేళ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు దుస్థితిపై అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డును మరమ్మతు చేయాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కిరణ్, ఆర్‌అండ్‌బీ, ఏఈ
ఫోన్ నంబర్: 94408 18864

సమాచారం

నేడు మండల స్థాయి అధికారుల సమావేశం

తంగళ్లపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల స్థాయి, క్లస్టర్ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పి.లచ్చాలు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా చేపట్టే కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి, క్లస్టర్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

11న కవి సమ్మేళనం

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ధి ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 11న కవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తెలిపారు. కేంద్ర గ్రంథాలయ భవనంలో నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనే ఆసక్తిగల జిల్లాకు చెందిన కవులు తమ కవితలను బుధవారం సాయంత్రం 5 గంటల లోపు పంపించాలన్నారు. తెలంగాణ అస్తిత్వం, ప్రగతి ప్రధాన నేపథ్యంగా 20 పంక్తులకు మించని తెలుగు, ఉర్దూ కవితలు 99089 22301 సెల్ నెంబర్‌కు వాట్సప్ ద్వారా పంపాలని కోరారు. నిర్వాహకుల ఎంపిక మేరకు ఆహ్వానించిన కవులు సమ్మేళనంలో పాల్గొనవచ్చునన్నారు.

నియామకం

దివ్యాంగుల సంఘం కార్యవర్గం

ముస్తాబాద్: మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడిగా పాతూరి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు జిల్లా అధ్యక్షుడు మొసర్ల లింగారెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఎదునూరి రాములు, కోశాధికారిగా నందెల్లి వెంకట్‌రావు, సలహాదారుగా ఒల్లెపు మల్లేశం ఎన్నికయ్యారు.

అంబేడ్కర్ యువజన సంఘం

గంభీరావుపేట: మండల కేంద్రంలోని దోసలగూడెం అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా టీకుమల్ల బాలయ్య, ఉపాధ్యక్షుడిగా దోసల రవి, కోశాధికారిగా దోసల శ్రీనివాస్, రైటర్‌గా బరిగెల నవీన్, కార్యవర్గ సభ్యులుగా దోసల రాజనర్సు, సురేందర్, వెంకటరాజం, గాధం నారాయణ, దేవవ్వ, మల్లయ్య ఎన్నికయ్యారు.

ప్రజావాణిలో గ్రామ సమస్యలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రజిత

ఎల్లారెడ్డిపేట: మేజర్ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలపై ఉపసర్పంచ్ ఒగ్గు రజిత సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో నివాసముంటున్న వారి కోసం ప్రతినెల తాత్కాలికంగా ఒక్క రోజు బియ్యం ఇచ్చేవిధంగా చూడాలని కోరారు. గ్రామం నుంచి బియ్యం తీసుకెళ్లడానికి ఆటో కిరాయిలు తడిసి మోపెడవుతున్నాయని తెలిపారు. అలాగే విద్యుత్ బిల్లుల చెల్లింపుకు కిష్టంపల్లిలో కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారించాలని కోరారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గ సమావేశం

సిరిసిల్లకల్చరల్: పట్టణ పద్మశాలీ సంఘం సోమవారం కార్యాలయంలో కార్యవర్గసమావేశం జరిగింది. ఆత్మ గౌరవ భవన నిర్మాణాల్లో భాగంగా ఏడాది క్రితం కలెక్టరేట్ సమీపంలో కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి సంబంధించిన కీలకాంశాలను చర్చించినట్లు సంఘం అధ్యక్షుడు గోలి వెంకట రమణ తెలిపారు. సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు నిర్మాణంలో ఉన్న శివ భక్త మార్కండేయ దేవాలయాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సభ్యులు ప్రతిపాదించిన అంశాలను చర్చించి త్వరలోనే కమిటీలను నియమించనున్నట్లు వివరించారు.

గజల్ కవి సమ్మేళనంలో మెరిసిన జిల్లా కవులు





సత్కారం అందుకున్న దేవానందం, డాక్టర్ నర్సన్

సిరిసిల్లకల్చరల్/వేములవాడ: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన గజల్ సాహిత్య వేదికపై జిల్లాకు చెందిన గజల్ కవి, మానేరు రచయితల సంఘం ఉపాధ్యక్షుడు బూర దేవానందం, హన్మాజీపేటకు చెందిన డాక్టర్ నర్సన్ తన ప్రతిభ చాటుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలి వచ్చిన గజల్ కవులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. సమ్మేళనంలో తమ గజల్ గానంతో ఆహుతులను అలరించాడు. సాటి కవులు ప్రశంసలతో పాటు, నిర్వాహకుల నుంచి సత్కారం అందుకున్నారు. రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో ప్రశంసలు, సత్కారం అందుకున్న వీరిద్దరిని జిల్లాలోని పలువురు కవులు, మారసం ప్రతినిధులు అభినందించారు.

డిగ్రీ కళాశాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం రూపొందించిన ప్రచార పోస్టర్లను టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సోమవారం ఆవిష్కరించారు. కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, అధునాతన కంప్యూటర్, సైన్సు ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ల కోసం దోస్త్‌లో మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలకు నీరు పోశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి, సీనియర్ అధ్యాపకులు కృష్ణమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



చందుర్తి: నాణ్యమైన విద్య కోసం అగ్రహారం డిగ్రీ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వద్లూరి శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. చందుర్తి మండలం చందుర్తి, మల్యాల, లింగంపేట గ్రామాల్లో ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన విద్యార్థుల ఇంటింటా ప్రచారాన్ని కళాశాల అధ్యాపకులు సోమవారం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ , అధ్యాపకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి, డాక్టర్ అరుణ్, రమేశ్‌శర్మ, పాల్గొన్నారు.

సర్కార్ బడిలో చేర్పించండి



ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: సర్కార్ బడిలో తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లిలో సోమవారం ఉపాధ్యాయులు, నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, ఎస్‌ఎంసీ చైర్మన్ కిశోర్, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్‌యాదవ్, ప్రధానోపాధ్యాయులు మంజుల, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ జోసెఫ్, ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఉత్సవాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. చెరువులు, మంచినీళ్లు, పల్లె ప్రగతి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. తెలంగాణకు ముందుకు, తెలంగాణ వచ్చాక పరిస్థితుల్లో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వివరించాలన్నారు. తూతూ మంత్రంగా వేడుకలను నిర్వహించకుండా, అందరిని భాగస్వాములను చేయాలని కోరారు. ఎంపీడీవో రమాదేవి, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఇనాయతుల్ల, సుకన్య, శ్యామ్, మోహన్, జయసుధ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

కోనరావుపేట: మండలం మల్కపేట గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ ఆరె లత సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామ బస్టాండ్ ప్రాంతంలో పురాతన కాలం నుంచి ఉన్న పోచమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయ స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు, అన్ని కుల సంఘాలు నిర్ణయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జవ్వాజి అంజయ్య, శంకరయ్య, పయ్యావుల దేవదాస్, అన్ని కుల సంఘాల సభ్యులు, పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి సంపత్

చందుర్తి: గర్భిణుల ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంపత్ కోరారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు అధికంగా తీసుకోవాలన్నారు. ప్రసవాలకు తీసుకు వచ్చే వారి బ్లడ్ గ్రూపులను ముందుగానే గుర్తించి, అవసరమైన వారికి బ్లడ్‌ను అందించేందుకు జిల్లా ఆసుపత్రికి సమన్వయ అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య సమాచారాన్ని ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పీహెచ్‌సీకి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవాలు జరిగేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పలు గ్రామాల గర్భిణులు పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న సీఎం కేసీఆర్'

ఇల్లంతకుంట: తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల పాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు మ్యాకల మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల క్రితం 60 వేల కోట్లు ఉన్న రాష్ట్ర అప్పులు ఇప్పుడు రూ.6 లక్షల కోట్లకు చేరుకున్నాయని విమర్శించారు. తెలంగాణను అప్పుల కుప్పగా మార్చి సీఎం కేసీఆర్ సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పబోతున్నారన్నారు.

పరిహారం అందజేత

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పశువులకు సెస్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిహారం అందజేశారు. నిజామాబాద్‌కు చెందిన ముష్కం చంద్రయ్య గౌడ్‌కు రూ.40 వేలు, మంగళ్లపల్లికి చెందిన ఉప్పుల పర్శరాములుకు రూ.40 వేల చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ పర్శరాములు, వంగపెల్లి శ్రీనివాస్, గుండ తిరుపతి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో రూ.7 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ గున్నాల అరుణ లక్ష్మణ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు జవ్వాజి దేవయ్య, ఇప్ప రాములు, వార్డు సభ్యులు తీగల వెంకటి, బత్తుల రేఖ, కార్యదర్శి అభిలాష్, గ్రామస్తులు వెంకన్న, గోపి, ప్రసాద్, కొమ్మెటి తిరుపతి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా రమేశ్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంపీవో శ్రీధర్ సెలవుపై వెళ్లడంతో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రమేశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఉన్న ఈ కార్యాలయంలో ఇన్‌చార్జిగా రమేశ్‌కు బాధ్యతలు అప్పగించడంతో సిబ్బందిపై అదనపు పనిభారం పడుతోంది.